

శరణామృతం ఐదవ ఎడిషన్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి

ప్రతీ ఒక్కరికి దైవచింతన ఎంతో అవసరం: ఈటల

చంపాపేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరికి దైవచింతన ఎంతో అవసరం అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. హస్తినాపురం డివిజన్ బైరామల్‌గూడ డిఫెన్స్‌కాలనీలోని శ్రీ హరిహరక్షేత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం బ్రహ్మశ్రీ, సరస్వతీపుత్ర రమణ గురుస్వామి గానం చేసిన శబరియాత్ర-16వ వాల్యూమ్, శరణామృతం-5వ ఎడిషన్‌ను ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ అఖిల భారత అధికార ప్రతినిధి శశిధర్, ఆలయ వ్యవస్థాపకులు, చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ వంగా చంద్రారెడ్డి, గంటి నాగేష్ గురుస్వామి, ఆలయ డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

చంపాపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. హస్తినాపురం చౌరస్తాలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యదర్శి నరేష్‌యాదవ్ చేపట్టిన 48గంటల నిరాహారదీక్ష శనివారం రెండోరోజు కొనసాగింది. దీక్షా శిబిరాన్ని ఈటల, జిల్లా బీజేపీ అర్బన్ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు వంగా మధుసూదన్‌రెడ్డి, లచ్చిరెడ్డి, ఎల్బీనగర్ బీజేపీ ఇన్‌చార్జీ సామ రంగారెడ్డి, ఎల్బీనగర్ బీజేపీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు కె.గణేష్ తదితరులు సందర్శించి తమ మద్దతు ప్రకటించారు.

48 గంటల నిరాహారదీక్ష విరమణ



నరేష్‌యాదవ్ దీక్షను నిమ్మరసం ఇచ్చి విరమింపజేస్తున్న వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి

చంపాపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ హస్తినాపురం చౌరస్తాలో రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యదర్శి నరేష్‌యాదవ్ చేపట్టిన 48 గంటల నిరాహారదీక్షను శనివారం రాత్రి జిల్లా బీజేపీ అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి నిమ్మరసం అందించి విరమింపజేశారు. కార్యక్రమంలో బీజేపీ, జిల్లా రాష్ట్ర, ఆయా డివిజన్‌ల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




ప్రదర్శనను ప్రారంభిస్తున్న మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

జిల్లెలగూడలో చేనేత హస్తకళా ప్రదర్శన ప్రారంభం

సరూర్‌నగర్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడలో మైత్రీపురం మహిళా మండలి ఆధ్వర్యంలో శనివారం కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శనను మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించి మహిళలతో ముచ్చటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు తమలో ఉన్న ప్రతిభను బహిర్గతపరచడానికి ఇలాంటి ప్రదర్శనలు తోడ్పడతాయన్నారు. చేనేత వస్తువులతో పాటు ఇతర వస్తువులను సైతం తయారు చేసి ఉపాధి పొందాలని సబితారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, మహిళా మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి : సీఐటీయూ

ఎల్బీనగర్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, జీహెచ్‌ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ మీసాల శ్రవణ్‌కుమార్ పిలుపునిచ్చారు. కర్మన్‌ఘాటల్ జానకీ ఎన్‌క్లేవ్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో జీహెచ్‌ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా 2వ మహాసభ శనివారం జీహెచ్‌ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ఈనెల 14, 15 తేదీలలో తుర్కయంజాల్‌లో జరుగనున్నాయన్నారు. జీహెచ్‌ఎంసీ అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.



ఏఐసీసీ పరిశీలకులు అమీద్ పటేల్‌ను శనివారం గాంధీభవన్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాకప్పి సత్కరిస్తున్న హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ -సైదాబాద్, ఆంధ్రజ్యోతి

విద్యార్థినుల దాహార్తి తీర్చిన మాజీ మేయర్

మహిళా పాలిటెక్నిక్ కాలేజీలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు ● సొంత నిధులతో ఏర్పాటు చేయించిన పారిజాతారెడ్డి



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన అనంతరం విద్యార్థినులతో పారిజాతారెడ్డి తదితరులు

సరూర్‌నగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దాహార్తితో విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులను గమనించిన బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతా నర్సింహారెడ్డి.. వారి దాహార్తిని తీర్చడానికి ముందుకొచ్చారు. తాగునీటి సౌకర్యం లేక తిప్పలు పడుతున్నామంటూ ఇటీవల బడంగ్‌పేట్‌లోని ఉమెన్స్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు ఆమె ఎదుట మొరపెట్టుకున్నారు. దీంతో స్పందించిన ఆమె వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో కళాశాలలో తన సొంత నిధులతో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారు. సదరు ప్లాంట్‌ను శనివారం విద్యార్థినులతో కలిసి పారిజాతారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలలోని హాస్టల్ విద్యార్థినులతో పాటు రెగ్యులర్ విద్యార్థినుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ ప్లాంట్ ఏర్పాటు చేయించినట్టు పేర్కొన్నారు. ప్లాంట్‌ను జాగ్రత్తగా వినియోగించుకోవాలని, ఇకముందు కూడా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. పాలిటెక్నిక్ కాలేజీలోనే డిగ్రీ కాలేజీ సైతం నిర్వహిస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ విద్యార్థినులు, సిబ్బంది ఆమె దృష్టికి తీసుకురాగా డిగ్రీ కాలేజీని మరోచోటుకు తరలించడానికి ప్రభుత్వ పెద్దలతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటానని పారిజాతారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ రైతు సొసైటీ పీఏసీ చైర్మన్ బంగారి బాబు, కౌన్సిల్ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రాళ్లగూడెం సంతోషీ శ్రీనివాస్‌రెడ్డి, ఏఐసీసీ విచార్ విభాగ్ కో ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్ రామకృష్ణప్రసాద్, నాయకులు గట్టు బాలకృష్ణ, ఇక్కె శ్రీనివాస్, కృష్ణారెడ్డి, పెద్దబావి బాబు, దిండు శ్రీనివాస్‌గౌడ్, బద్దం రాము, రమేశ్‌గౌడ్, గిరిముదిరాజ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయులు ఎల్బీనగర్ సీనియర్ సిటిజన్లు : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



అభయ సీనియర్ సిటిజన్స్ ఫోరం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : పదవీ విరమణ పొందినప్పటికీ నిత్యం సమాజ సేవలో ముందుంటూ ఎల్బీనగర్ నియోజకవర్గంలోని సీనియర్ సిటిజన్లు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్ శ్రీసాయినగర్ సౌత్‌కాలనీలో అభయ సీనియర్ సిటీజన్స్ ఫోరం భవనాన్ని ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్ యాదవ్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. కాలనీ, అభయ సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు బద్దం భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నో ఇబ్బందులను అధిగమించి సీనియర్ సిటిజన్స్ భవనాన్ని అధికారికంగా ప్రారంభించుకోవడం పట్ల కాలనీ సభ్యులను అభినందించారు. కొందరు నాయకులు తమ స్వార్థప్రయోజనాల కోసం కాలనీ అసోసియేషన్ల నడుమ చిచ్చుపెట్టి కాలనీని ఫేజ్-1, ఫేజ్-2 లుగా విడదీసే ప్రయత్నాలు చేస్తున్నారని, ఇలాంటి సమస్యలు నియోజకవర్గంలోని పలు డివిజన్లలో చూస్తున్నామన్నారు. ప్రతీ కాలనీలో పార్కులు, అసోసియేషన్ భవనాలు, మైదానాలు తీర్చిదిద్దేందుకు తాను పాటుపడుతున్నానని, ఇందుకు కాలనీ అసోసియేషన్లు కూడా సహకరించాలన్నారు. పార్టీలకు అతీతంగా వివాదాలకు తావ్వికుండా ముందుకు సాగుతున్నారంటూ స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్‌ను సుధీర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఆసరా అధ్యక్షుడు పాటి యాదిరెడ్డి, కాలనీ ప్రధానకార్యదర్శి చెరుకు ఉమేష్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాగోల్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, సీనియర్‌నేత అనంతుల రాజారెడ్డి, సిద్దాల ఐలయ్య, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన జోనల్‌స్థాయి కబడ్డీ పోటీలు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ 69వ హయత్‌నగర్ జోనల్ స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. ముగింపు పోటీలకు హయత్‌నగర్ జోనల్ సెక్రెటరీ నిర్మల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అండర్-14, 17 విభాగంలో బాలుర, బాలికలకు నిర్వహించిన ఈ పోటీలలో మొత్తం 1500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

అండర్-14 బాలికల విభాగంలో పెద్దఅంబర్‌పేట్ జడ్పీహెచ్‌ఎస్ విజేత, ఇంజాపూర్ జడ్పీహెచ్‌ఎస్ రన్నర్, బాలుర విభాగంలో హయత్‌నగర్ జడ్పీహెచ్‌ఎస్ విజేత, తారామతిపేట జడ్పీహెచ్‌ఎస్ రన్నర్, అండర్-17 బాలికల విభాగంలో హయత్‌నగర్ ఎంజేపీ విజేత, తారామతిపేట జడ్పీహెచ్‌ఎస్ రన్నర్, బాలుర విభాగంలో బాటసింగారం జడ్పీహెచ్‌ఎస్ విజేత కాగా, న్యూ చైతన్య స్కూల్‌కు ద్వితీయ స్థానం దక్కింది.

షూటింగ్ పోటీల్లో సత్తా చాటుతున్న మణిశంకర్

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామంలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీకి చెందిన కొక్కెర మణిశంకర్‌యాదవ్ షూటింగ్ క్రీడా విభాగంలో తన సత్తాచాటుతున్నాడు. ఇటీవల స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలో నిర్వహించిన 11వ రాష్ట్ర షూటింగ్ క్రీడ 25 మీటర్ల పిస్టోలు విభాగంలో మణిశంకర్‌యాదవ్ అర్హత సాధించినట్లు అతడి తండ్రి, సురక్ష సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర గోపిశంకర్‌యాదవ్ తెలిపారు. ఈ నెల 13న కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం వట్టివారకావ్‌లో జరుగనున్న 25 మీటర్ల 16న సౌత్‌జోన్ జాతీయ షూటింగ్ చాంపియన్ షిప్ పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి మణిశంకర్ యాదవ్ ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ మేరకు అతడు జాతీయ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనేందుకు శనివారం కేరళకు బయలుదేరారు.

బార్ అసోసియేషన్‌కు టీవీ బహూకరణ

రంగారెడ్డి జిల్లా కోర్టులు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్‌కు తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు టి.హనుమంత్‌రెడ్డి టీవీ బహూకరించారు. ఈ సందర్భంగా హనుమంత్‌రెడ్డిని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి బాసెట్టి కార్తీక్‌లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు అనంతసేనారెడ్డి, మహిళా ప్రతినిధి అనసూయ, సీనియర్ న్యాయవాదులు దీకొండ రవీందర్, హరీష్, పవన్‌కుమార్, నిరంజన్‌రెడ్డి, భరత్‌రెడ్డి, రవికుమార్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బాలాపూర్‌కు అదనపు బస్సులు వేయండి

సరూర్‌నగర్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌కు కేవలం ఒక్క ఆర్టీసీ బస్సు మాత్రమే తిరుగుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ దృష్ట్యా అదనపు బస్సులు ప్రవేశపెట్టి ఇబ్బందులు దూరం చేయాలని కాంగ్రెస్ నాయకులు ఆర్టీసీ అధికారులను కోరారు. ఈ మేరకు టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు బాల్‌నింగని జంగయ్య ఆధ్వర్యంలో శనివారం మిధాని డిపో ఆర్టీసీ అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు క్యారగారి శ్రీధర్, నాయకులు కప్పాటి అంజనేయులు, సురేందర్, రవి, రమేశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఉపేందర్‌గుప్తా

221వ ఉచిత వివాహం

దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): మొగుళ్లపల్లి యువసేన ఆధ్వర్యంలో 221వ ఉచిత వివాహాన్ని గడ్డిఅన్నవరం లలితానగర్‌లోని శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శనివారం ఘనంగా నిర్వహించారు. శివకుమార్, అనూష వధూవరులకు సెంట్రల్ సెన్సార్ బోర్డు మెంబర్ డా.మొగుళ్లపల్లి ఉపేందర్‌గుప్తా బంగారు పుస్తె, మెట్టెలు అందించారు. సత్యనారాయణస్వామి దేవస్థానంలో వారికి ఉచితంగా వివాహం జరిపించారు. వివాహ అనంతరం విందుభోజనంతో పాటు, నూతన కాపురానికి దుస్తులు, సామగ్రిని కూడా అందజేసి, వధూ వరులను ఆశీర్వదించారు. పెళ్లికి సహకరించిన తిరుమల మహేష్, సూరిశెట్టి శ్రీనివాస్, బొగ్గారపు వెంకటేష్, అంకిశెట్టి సత్యనారాయణ, చంద్రమౌళి, బాల్‌రెడ్డి, నర్సింహాలకు ఉపేందర్‌గుప్తా కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఉచిత గైనకాలజీ శిబిరం

దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): చైతన్యపురి గీత మల్టీ స్పెషాలిటీలో ఉచిత గైనకాలజీ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రముఖ స్త్రీ, ప్రసూతి వైద్యురాలు సత్యశ్రీ వెల్లడించారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గీత ఆసుపత్రి ఆవరణలో నిర్వహించనున్న శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం



చాదర్‌ఘాట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని చాదర్‌ఘాట్ పోలీసులు శనివారం గుర్తించారు. చాదర్‌ఘాట్ ఎస్ఐ భరత్ వివరాల ప్రకారం.. 55 ఏళ్ల వయసున్న వ్యక్తి మలక్‌పేట గంజ్ సమీపంలోని రిలయన్స్ డిజిటల్ వద్ద పడి ఉన్నట్లుగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు పోలీసులు వ్యక్తిని పరిశీలించగా అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లుగా గుర్తించి 108ను పిలిపించారు. అంబులెన్స్ సిబ్బంది వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించడంతో మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చాదర్‌ఘాట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బొడ్రాయి ధాన్యాదివాసం కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, కార్పొరేటర్లు కళ్లెం నవ జీవన్‌రెడ్డి, కొప్పుల నరసింహారెడ్డి, ఉత్సవ కమిటీ నిర్వాహకులు

బొడ్రాయి ఏర్పాటుతో గ్రామానికి ఆధ్యాత్మిక శోభ

హయత్‌నగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ నేతాజీ కాలనీలో జరుగుతున్న బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా శనివారం ధాన్యాదివాస, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి హాజరుకాగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. బొడ్రాయికి శుక్రవారం జలవాసం ముగియడంతో శనివారం ధాన్యాదివాసం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నగల్ హయత్‌నగర్ రామలింగేశ్వర ఆలయం ఎదుట అన్నప్రసాద కార్యక్రమానికి వేలాది భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ, బొడ్రాయి ఏర్పాటుతో గ్రామానికి ఆధ్యాత్మిక శోభ సంతరించుకుందన్నారు. ఈ సంప్రదాయం గ్రామ ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, ఉత్సవ కమిటీ నిర్వాహకులు కళ్లెం రవీందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, గజ్జి భాస్కర్ యాదవ్, నక్క వెంకటేశ్‌గౌడ్, సునీల్‌గౌడ్, యోగి, నక్క దర్శన్‌గౌడ్, భాస్కర్‌సాగర్, గుడాల మల్లేష్, విష్ణు, నగేష్, ఎల్లప్ప, కడారి పెంటయ్య, రవీందర్‌గౌడ్, పారంద రమేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



శాలివాహననగర్ కాలనీలో పండ్ల దుకాణంలోకి దూసుకొచ్చిన జీపు

వేగంగా వెళ్తూ అదుపుతప్పిన జీపు

పండ్ల దుకాణంలోకి దూసుకొచ్చి.. వాహనదారుడికి గాయాలు

చాదర్‌ఘాట్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న జీపు అదుపుతప్పింది. రోడ్డు పక్కనే ఉన్న పండ్ల దుకాణంలోకి దూసుకెళ్తుండగా అడ్డు వచ్చిన ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. వాహనాదారునికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. మలక్‌పేట ఎస్ఐ సంజీవరెడ్డి వివరాల ప్రకారం.. ఏపీ వైజాగ్ నివాసి హరి (24) శనివారం ముసారాంబాగ్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్తున్నాడు. ఇంతలో జీపు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పండ్ల దుకాణంలోకి దూసుకెళ్తుండగా అడ్డువచ్చిన హోండా యాక్టీవాను ఢీ కొట్టింది. యాక్టీవా నడుపుతున్న ఉప్పల్ బగాయత్ నివాసి ప్రభాకర్ (60) తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు జీపు నడుపుతున్న హరిని అదుపులోకి తీసుకున్నారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

చిట్టీల పేరుతో తోటి ఉద్యోగులకు టోకరా

తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు



బజ్జూరి రాంచందర్

వనస్థలిపురం, అక్టోబరు 11(ఆంధ్ర జ్యోతి): చిట్టీల పేరుతో తోటి ఉద్యోగుల వద్ద అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసి తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని బోరబండ హాబీబ్ ఫాతిమానగర్‌కు చెందిన బజ్జూరి రాంచందర్(47) 2019 నుంచి వనస్థలిపురంలోని మాంగళ్య షాపింగ్ మాల్‌లో ఉద్యోగం చేస్తూ మునగనూర్‌లోని ద్వారకామయినగర్‌లో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో గత సంవత్సరం నుంచి తాను చిట్టీలు చేస్తున్నానని తోటి ఉద్యోగులను నమ్మించాడు. దీంతో సుమారు 20 మంది వద్ద చిట్టీ డబ్బులతో పాటు వారివద్ద ఉన్న క్రెడిట్ కార్డులు తీసుకుని వాటి నుంచి ముప్పై లక్షల రూపాయల డబ్బులు తీసుకుని అవసరాలకు వాడుకున్నాడు. దీంతోపాటు సదరు షాపింగ్ మాల్‌లో రాంచందర్ ఉద్యోగం మానేసి మునగనూర్‌లో ఇళ్లు ఖాళీ చేసి తప్పించుకుని తిరుగుతున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు శనివారం రాంచందర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలు దూరం

విద్యార్థులు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న రాచకొండ ట్రాఫిక్ ఆర్‌ఎస్ఐ

కొత్తపేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలతో ప్రయాణికులందరికీ సురక్షిత వాతావరణం ఏర్పడుతుందని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఆర్‌ఎస్ఐ సంతోష్ కుమార్, ఎస్ఐ నర్సింహారావు, ఏఎస్ఐ సోమ్‌నాథ్ అన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై శనివారం విద్యార్థులకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఆ తర్వాత వారు టీటీఐలో వివరాలు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై 13 అవగాహన కార్యక్రమాల్లో 375 మంది విద్యార్థులకు, వాహనదారులకు నిబంధనల ప్రాధాన్యతను వివరించామన్నారు. నారాయణపురంసర్వేల్ టీఎస్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 8,9,10 తరగతుల విద్యార్థులకు, నారాయణపురంలో 4, చౌటుప్పల్‌లో 3 ప్రాంతాల కూడళ్లలో వాహనదారులకు నిబంధనలు ఎందుకు పాటించాలో చెప్పామన్నారు. బైకులు నడిపే వారికి హెల్మెట్, కార్లు నడిపే వారికి, కార్లలో ప్రయాణించేవారికీ సీటు బెల్టు ప్రాధాన్యతను గుర్తు చేశామన్నారు. విద్యార్థులకు, వాహనదారులకు కరపత్రాలు తెలుగు, ఇంగ్లీషు సూచనలతో రూపొందించిన ఏబీసీ ఆఫ్ రోడ్ సేఫ్టీ ఫర్ చిల్డ్రన్ బుక్‌లెట్స్ పంపిణీ చేశామని పేర్కొన్నారు. రద్దీగా ఉండే చౌరస్తాల్లో రోడ్డు భద్రత బ్యానర్ ప్రదర్శిస్తూ నిబంధనలు పాటించాలని వివరించారు.

జీఎస్ఐలో ఈ- వ్యర్థాల సేకరణ

మన్సూరాబాద్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నాగోల్ బండ్లగూడలోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ఆధ్వర్యంలో ఈ-వ్యర్థాల సేకరణ ముమ్మరంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా పదో రోజైన శనివారం ఈ ప్రత్యేక కార్యాచరణలో జీఎస్ఐ కార్యాలయాధిపతి బసాబ్ ముఖోపాధ్యాయ పాల్గొని ప్రసంగించారు. ఈ-వ్యర్థాల సేకరణ కార్యాచరణ అక్టోబర్ 2 నుంచి 31వ తేదీ వరకు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బందితో కలిసి చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా పాడైపోయిన కంప్యూటర్లు, టీవీలు, మొబైల్ ఫోన్లు, బ్యాటరీలు, ప్రింటర్ల వంటి మరెన్నో ఎలక్ట్రానిక్ పరికరాలను అటెరో రీసైక్లింగ్ ప్రైవేటు లిమిటెడ్, జవహర్‌లాల్ నెహ్రూ అల్యూమినియం రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ డిజైనింగ్ సెంటర్ సంస్థల సహకారంలో జీఎస్ఐ సేకరిస్తోందన్నారు. ఈ-వ్యర్థాల సేకరణలో ఇప్పటి వరకు వంద మంది సిబ్బంది వెయ్యికి పైగా పరికరాలు సేకరించి రూ.1.40లక్షలు పొందడం జరిగిందన్నారు.

పాడైపోయిన ఒక్కో పరికరానికి రూ.100 నుంచి రూ.4వేలు ఇవ్వనున్నారని, ఇవ్వదలచిన పరిసర ప్రాంత ప్రజలు తమ పరికరాలను మొబైల్ 9989862597లో ఎ.శ్రీనివాసులును సంప్రదించాలని జీఎస్ఐ సంస్థ ప్రజాసంబంధాల అధికారి డాక్టర్ గంజి మల్లేష్ పేర్కొన్నారు.